ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
శుక్రవారం 1 మార్చి 2024

సౌలభ్యం కోసమే కొనుగోలు కేంద్రాలు
● సహకార సంఘాల ద్వారా రైతులకు మేలు
● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి 8



ఇసుకాసురులు కాసుల కక్కుర్తితో వాగునే మింగేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుకను రవాణా చేస్తూ ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతుండగా, అటు భూగర్భజలాలకు ముప్పు తీసుకొస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పునకు పర్మిట్ పొంది నాలుగు ట్రిప్పుల ఇసుకను తోడేస్తూ రాత్రుల్లో అడ్డదారుల్లో పట్టణాలకు తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. యథేచ్ఛగా రవాణా చేస్తున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక వ్యాపారుల నుంచి ముడుపులు ముట్టడంతోనే ఇటువైపు తొంగిచూడడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- నంగునూరు, ఫిబ్రవరి 29



ఎండిపోయిన నంగునూరు ఘనపూర్ పెద్దవాగు

ఇసుకాసురులు

- పెద్దవాగును మింగేస్తున్న ఇసుక దందా
- రాత్రి వేళల్లో పట్టణాలకు అక్రమ రవాణా
- విచ్చలవిడిగా దోచుకెళ్తున్న వ్యాపారులు
- ఇసుక తోడివేతతో భూగర్భజలాలకు ముప్పు

నంగునూరు మండలం ఖాత, అక్కెనపల్లి గ్రామాల పరిధిలోని పెద్ద వాగు ఇసుక వ్యాపారులకు అడ్డాగా మారింది. అభివృద్ధి పనులకంటూ కొందరు ట్రాక్టర్‌ల యజమానులు పర్మిట్ పొంది, ఇసుకను అక్రమమార్గంలో పక్కాదారి పట్టిస్తున్నారు. అధికారులు సీసీ రోడ్లు, ఇతర ప్రభుత్వ భవనాల కట్టడాల కోసం పర్మిట్లు జారీ చేస్తున్నారు. అయితే పర్మిట్ పొందిన వారు ఒకే కూపన్‌పై మూడు నుంచి నాలుగు ట్రిప్పుల ఇసుకను తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పరిస్థితులను బట్టి ఇసుకను ఆయా గ్రామ శివారుల్లో డంప్ చేసి తర్వాత లారీల్లో పట్టణాలకు రవాణా చేస్తున్నారు. వారి వ్యాపారం మూడు లారీలు ఆరు ట్రాక్టర్లుగా మారుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

రాత్రి వేళల్లో జోరుగా రవాణా

నంగునూరు, గట్లమాల్యాల, నాగరాజుపల్లి, ఖాత గ్రామాల శివారులోని పెద్దవాగు, ఘనపూర్, అక్కెనపల్లి ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇసుకను తోడేస్తున్నారు. రైతుల వ్యవసాయ భూముల నుంచి అడ్డదారుల గుండా సరిహద్దు పట్టణాలకు తరలిస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులు అక్కెనపల్లి పెద్దవాగు నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా రాత్రి వేళల్లో దోచుకెళుతున్నారు.

స్థానికులకు కొర్రీలు

మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇళ్లు కట్టుకునేందుకు ఇసుక కావాలంటే దొరకని పరిస్థితి నెలకొన్నది. పక్కనే వాగు ఉన్నా స్థానికులకు మాత్రం ఇసుక అందించేందుకు కొర్రీలు పెడుతున్నారు. నంగునూరు మండల వ్యాప్తంగా దాదాపు 50 ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా



వాగు పరీవాహక ప్రాంతంలో సాగుచేసిన వరి

స్థానికంగా ఇంటి నిర్మాణం చేసుకునే వారికి మాత్రం సకాలంలో దొరకడం లేదు. వ్యాపారులు సిండికేట్ కావడంతో ట్రాక్టర్ ఇసుక ట్రిప్పునకు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని గ్రామాల్లో నిర్మాణాలు చేసుకుంటున్నవారు వాపోతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలకు ప్రమాదం వాటిల్లింది. వాగు పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాగును నమ్ముకుని చాలామంది రైతుల పంటలను సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోతుండడంతో లబోదిబోమంటున్నారు. యాసంగి ప్రారంభంలో వ్యవసాయబావుల్లో పుష్కలంగా నీరు కనపడగా 15 రోజుల నుంచి నీరు అడుగంటిపోతున్నది. బోరుబావులు ఎండి పంటలకు నీరందించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలి

రాత్రివేళ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు ఎవరైనా ముందుకు వస్తే ఇసుక మాఫియాలు ఎంతకైనా తెగిస్తున్నారని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇసుక రవాణా అరికట్టాలని కొంతమంది రైతులు మండల శాఖ అధికారులకు కాకుండా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించడంతో ఇటీవల దాడులు చేసి అనుమతి లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగితేనే అనుమతులు లేని ట్రాక్టర్లకు కొంత మేర అడ్డుకట్ట పడింది అంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ఇసుక మాఫియాల ఆగడాలను అరికట్టాలని రైతులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నంగునూరులో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది(ఫైల్)



ఖాత పెద్దవాగు నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి (ఫైల్)



'మెగా' ఆనందం

- డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు
- జిల్లాలో మొత్తం 311 పోస్టుల భర్తీ
- సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులే అధికం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 29 : తెలంగాణ ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడంతో జిల్లాలోని బీఈడీ, టీటీసీ అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ప్రభుత్వం వేసిన డీఎస్సీలో పోస్టులు తక్కువగా ఉండడంతో నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం వేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి పోస్టులను పెంచుతూ మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2016 సంవత్సరంలో టీఆర్టీ నోటిఫికేషన్ తర్వాత ఇప్పటి వరకు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయలేదు. దాదాపు 8 ఏళ్ల తర్వాత మెగా డీఎస్సీ మోక్షం లభించిందని నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక సిద్దిపేట జిల్లాలో 311 ఉపాధ్యాయ పోస్టులను ఈ మెగా డీఎస్సీ ద్వారా అధికారులు భర్తీ చేయనున్నారు.

ఉపాధ్యాయ పోస్టుల వివరాలు

ఎస్‌ఏ (మ్యాథ్స్) తెలుగు మీడియం	5
ఎస్‌ఏ (బయోలాజికల్ సైన్స్)	18
ఎస్‌ఏ (ఇంగ్లిష్)	6
ఎస్‌ఏ (హిందీ)	4
ఎస్‌ఏ (తెలుగు)	8
ఎస్‌ఏ (ఎస్‌ఎస్) తెలుగు	31
ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	1
ఎస్‌ఏ (ఉర్దూ)	1
ఎస్‌ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)తెలుగు	9
ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్)	3
పీఈటీ (తెలుగు మీడియం)	8
లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)	9
లాంగ్వేజ్ పండిట్ (హిందీ)	15
సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు తెలుగు మీడియం	157
సెకండరీ గ్రేడ్ ఉర్దూ మీడియం	10
సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్) తెలుగు మీడియం	26

నూతన టెక్నాలజీతో..

జిల్లాలో బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు సుమారు 11 వేల మంది, టీటీసీ పూర్తి చేసిన అభ్యర్థులు సుమారు 6 వేల మంది ఉన్నారు. వీరిలో సగం మందికి పైగా టెట్ క్వాలిఫై అయి డీఎస్సీ రాయడానికి సిద్ధంగా ఉన్నారు. గతంలో రాత పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ఈ సారి నూతన టెక్నాలజీతో ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ సాయంతో పరీక్షలను నిర్వహించబోతున్నారు. ఈ మెగా డీఎస్సీ పరీక్షలు మే చివరి వారంలో లేదంటే జూన్ మొదటి వారంలో నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

3న పల్స్ పోలియో

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈ నెల 3న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 0-5 ఏళ్ల పిల్లలు 18,6212 మంది ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 1,137 బూత్‌లు, 38 రవాణా పాయింట్లు, 38 మొబైల్‌టీమ్స్ ద్వారా పోలియో చుక్కల మందును పంపిణీ చేయనున్నారు. తొలిరోజు చుక్కలు వేసుకోని వారికి మరుసటి రోజు ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది చుక్కల మందు వేస్తారని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ



నోటీస్ బోర్డుపై తమ హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

- తొలిరోజు 96 శాతం హాజరు
- మొత్తం 371 మంది గైర్హాజరు
- ఆలస్యంగా వచ్చిన ఒకరికి అనుమతి నిరాకరణ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 29 : సిద్దిపేట జిల్లాలో గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు మొదలయ్యాయి. 9,570 మంది విద్యార్థులు హాజరవ్వగా 371 మంది గైర్హాజయ్యారు. మొత్తంగా 96శాతం హాజరు నమోదైంది. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించలేదు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

నాలుగేళ్ల సంబురం

- లీపు సంవత్సరంపై ప్రత్యేక ఆసక్తి
- ఫిబ్రవరి 29న జన్మించిన పలువురు చిన్నారులు
- పెద్దసంఖ్యలో వివాహ శుభకార్యాలు
- వైభవంగా పలువురి పుట్టినరోజు వేడుకలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 29 : నాలుగేళ్లకు ఒకసారి పలకరించే ఫిబ్రవరి 29వ తేదీపై పలువురు అభిమానం చాటుకున్నారు. ఈ లీపు సంవత్సరాన్ని జీవితాంతం గుర్తుంచుకునేలా తమ అనుభూతిని పదిలపర్చుకున్నారు. ఏడాదికి ఒకమారు జరిగే పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలకు ప్రాధాన్యతనిచ్చే రోజులు ఇవి. అలాంటిది నాలుగేళ్లకోసారి ప్రత్యేకత ఉంటే ఇక ఆ సంబరాలకు అవధులుండవు. అందుకే నిన్నటి రోజు కొందరి జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నది. దీనికితోడు మాఘ పంచమి కావడంతో పెద్ద సంఖ్యలో వివాహాలు, ఇతర శుభకార్యాలను నిర్వహించారు.

50 మందికి పైగానే చిన్నారుల జననం

ఫిబ్రవరి 29న జిల్లావ్యాప్తంగా సుమారు 50 మందికి పైగానే జన్మించినట్లు అంచనా. గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడుగురు జన్మించారు. అందులో ముగ్గురు మగ, నలుగురు ఆడపిల్లలు. ఇక సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 20 మంది దాకా జన్మించారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ పెద్ద సంఖ్యలోనే ప్రసవాలు జరిగినట్లు తెలిసింది. కొందరికి నొప్పుల కారణంగా ప్రసవాలు జరుగగా, ఇంకొందరు ప్రత్యేకత కోసం పిల్లలకు జన్మనిచ్చినట్లు సమాచారం.

మార్మోగిన పెళ్లిబాజాలు..

మాఘమాసం, పంచమి తిథి సందర్భంగా గురువారం కల్యాణ మంటపాలు వివాహాలతో కళకళలాడాయి. మంచిరోజు కావడంతో పాటు ఫిబ్రవరి 29న పెళ్లిరోజు జరుపుకుంటామనే ఆసక్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతున్నది. యేటా వచ్చే పెళ్లిరోజు కంటే నాలుగేళ్లకు ఒకసారి పలకరించే పెళ్లిరోజును ఆస్వాదించడం ఎంతో ఆనందంగా ఉంటుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తపరిచారు. అదే విధంగా నూతన గృహప్రవేశాలను చాలామంది నిర్వహించుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాళ్లన్నీ వివాహాలతో బిజీగా మారాయి. జిల్లా వ్యాప్తంగా 100కు పైగానే వివాహాలు జరిగాయి.





పుట్టిన నాలుగేళ్ల తర్వాత తొలి పుట్టినరోజు వేడుక జరుపుకున్న దుబ్బాకలోని కౌన్సిలర్ బాలకృష్ణ గౌడ్ కూతురు సాత్విక



పన్నెండేళ్లలో మూడు పుట్టినరోజులే

మా పాప వడ్లూరి ప్రణీత 2012 ఫిబ్రవరి 29న జన్మించింది. మా బాబుకు ఏటా పుట్టినరోజు చేస్తుంటే పాపకు మాత్రం నాలుగేళ్లకోసారి చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో కొంత బాధగా ఉన్నప్పటికీ నాలుగేళ్లకు ఒకసారి మంచి అనుభూతితో ఘనంగా వేడుక చేస్తున్నాం. ఆమె జన్మించి 12 ఏళ్లు అవుతుంది. కానీ, ఇప్పటికి మూడు సార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలు నిర్వహించాం.

- వడ్లూరి మరియా శ్రీనివాస్, మాచాపూర్, చిన్నకోడూరు

చాలా సంతోషంగా ఉంది



లీపు సంవత్సరంలో మాకు బాబు జన్మించడం చాలా సంతోషంగా ఉంది. అది కూడా నార్మల్ డెలివరీ జరిగింది. ప్రత్యేకమైన రోజు కావడం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలోనే సుఖప్రసవం జరగడం ఆనందంగా ఉంది. ఈరోజు మాకు జీవితాంతం తీపి గుర్తును మిగిల్చింది.

- లక్ష్మీ-కనకరాజు, ఎర్రవల్లి, మర్కుక్

నా బర్త్‌డే ప్రత్యేకం



నేను 1996 సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీన పుట్టాను. అందరూ ప్రతీ ఏటా తమ బర్త్‌డే చేసుకుంటే నేను నాలుగేళ్లకోసారి జరుపుకుంటాను. మా తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి స్పెషల్‌గా పుట్టినరోజు నిర్వహించుకుంటా. 2020వ సంవత్సరం తర్వాత బర్త్‌డే చేసుకోవడం చాలా సంబురంగా ఉంది. అందరూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పారు.

- వడ్ల శ్రీకాంత్, మల్లుపల్లి, మిరుదొడ్డి



కల్యాణ వైభోగం

హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కుమార్తె త్రిష దామోదర్ వివాహం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సతీశ్-అశ్విని వివాహం

ఉచిత శిక్షణ.. మహిళలకు ఆర్థిక రక్షణ

● ఎన్ఏసీ సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ
● బ్యాచ్‌కు 30 మంది చొప్పున మూడునెలల పాటు..

చిన్నకోడూరు, ఫిబ్రవరి 29: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) సంస్థ సహకారంతో చిన్నకోడూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన శిక్షణ కేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన (కుటుంబసభ్యులకు లేబర్ కార్డు ఉన్న యువతులు, మహిళలకు) యువతులు, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తూ ఉపాధికి బాటలు వేస్తున్నది. అనుభవజ్ఞులైన శిక్షకులతో ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్నవాటిపై తర్ఫీదు ఇస్తూ మహిళలు, యువతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారు. బ్లౌజ్‌లు, ఫ్రాక్స్, గౌనులు, లాంగ్ ఫ్రాక్స్, పంజాబ్ డ్రెస్ వంటి సుమారు 30 రకాల వెరైటీలు కుట్టడంపై శిక్షణ ఇస్తున్నారు.

ఉచితంగా కుట్టు మిషన్

ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే మొదటి బ్యాచ్ పూర్తికాగా.. రెండో బ్యాచ్‌కు కుట్టు మిషన్ శిక్షణ కొనసాగుతున్నది. శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు, మహిళలకు సర్టిఫికేట్‌తో పాటు, కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలు, యువతులు ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందుతున్నారు.


ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

శిక్షణ చాలా బాగుంది

నేను ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చి కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ చాలా మోడల్స్ నేర్పుతున్నారు. నేర్చుకునేటప్పుడు సందేహాలు వస్తే ట్రైనర్‌ను అడిగితే వెంటనే నివృత్తి చేస్తున్నారు. శిక్షణ తర్వాత ఇంటి దగ్గర టైలరింగ్ ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. శిక్షణ చాలా బాగుంది.

- కట్కూరి కవిత, రామునిపట్ల

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఏసీ సహకారంతో యువతులకు, మహిళలకు బ్యాచ్‌కు 30 మంది చొప్పున 3 నెలల పాటు కుట్టు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌తో పాటు, కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తున్నాం. యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

- బి.రజిత, మాస్టర్ ట్రైనర్

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దు

● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

కొండాపూర్, ఫిబ్రవరి 27: సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని, సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి బ్యాంకు అకౌంట్, ఓటీపీ వంటి వివరాలు అడిగితే చెప్పకూడదని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. గురువారం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రయ్య ఏర్పాటు చేసిన సైబర్ క్రైం నేరాలపై ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్పీ హాజరై మాట్లాడారు. ఈ మధ్య సైబర్ నేరగాళ్లు ఫేక్ కాల్స్ చేసి అకౌంట్ వివరాలు అడుగుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ మోసం జరిగితే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. చిన్న పిల్లల దొంగలంటూ యూట్యూబ్, వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ వీడియోలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ క్రమంలో సందర్శనకు వచ్చే యాత్రికులపై అనుమానం వచ్చి దాడులకు దిగడం సరైంది కాదన్నారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఒక్క చిన్న పిల్ల కూడా అపహరణకు గురికాలేదని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాలించాలని సూచించారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ ఈనెల 9న సంగారెడ్డి జిల్లా కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా అవగహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్





జహీరాబాద్‌లోని రైతుల వెంట ఉంటూ పొలాల్లో పనులు చేస్తున్న విద్యార్థినులు

సాగుబాటతో జ్ఞానాన్ని ఒడిసి పడుతూ..

● వ్యవసాయ సాగులో మెళకువలు నేర్చుకుంటున్న విద్యార్థినులు ● జహీరాబాద్ వేదికగా క్షేత్రస్థాయి సందర్శనలు



రంజోల్ గ్రామంలో భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమంలో భాగంగా చిత్రాన్ని (మ్యాప్) వేస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్, ఫిబ్రవరి 29: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు వచ్చి సాగుబాట పట్టి.. జ్ఞానాన్ని ఒడిసి పడుతున్నారు. 'గ్రామీణ ఉద్యాన పని- అనుభవ శిక్షణ'లో భాగంగా ప్రతియేటా జనవరి మొదలుకుని ఏప్రిల్ వరకు క్షేత్రస్థాయి సందర్శనకు ఆయా ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థినులను యాజమాన్యాలు పంపిస్తుంటాయి. రైతుల వద్ద పంటల సాగు విధానాన్ని నేర్చుకుని పరీక్షలకు సిద్ధమయ్యేలా చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం లాగే.. ఈ సంవత్సరం కూడా 30 మంది విద్యార్థినులు శిక్షణ నిమిత్తం వచ్చారు. ప్రస్తుతం వారు రంజోల్, చిన్న హైదరాబాద్‌లో ఉంటూ రైతుల వద్ద అనుభవాలను నేర్చుకుంటున్నారు. స్థానికంగా ఉండే అధికారులు ఉద్యాన పంటలను సాగుచేసే ఒక్కో రైతుకు, ఒక్కో విద్యార్థిని అటాచ్ చేశారు. ఆయా విద్యార్థిని మూడునెలల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులతో ఉంటూ సాగు పద్ధతులను అవగతం చేసుకోవాల్సి ఉంటుంది. పంటల సాగులో విత్తనాలు నాటే మొదలుకుని పంట చేతికొచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాన్ని రైతుల వెంటే ఉండి నేర్చుకుంటున్నారు. రసాయనాలు, సేంద్రియ ఎరువుల వాడకం, పంటలపై రసాయనాలను పిచికారీ చేసే విధానం, పంటల దిగుబడి, ఏయే సమయాల్లో కలుపు మొక్కలు తీయాలి, పంట చేతికి ఎప్పుడు వస్తుందనే వివరాలను రైతుల ద్వారా నివృత్తి చేసుకుంటున్నారు.

ఉద్యాన విద్యార్థులకు శిక్షణ కేంద్రం జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో ఉద్యాన పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న నేపథ్యంలో జహీరాబాద్ విద్యార్థులకు శిక్షణ కేంద్రంగా మారింది. ఉద్యాన పంటలతో పాటు రైతులు అదనంగా జెరేనీయం, అంజీర్, యాపిల్, డ్రాగన్‌ఫ్రూట్, చియా(సబ్జగింజలు) తదితర కొత్తరకం పంటలను సాగుచేస్తున్నారు. వీటితో పాటు అరటి, బొప్పాయి, మామిడి, జామ, సపోట, యాపిల్, అల్లం, ఉల్లిగడ్డను సాగుచేస్తున్నారు. కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో 20వేల పైచిలుకు ఎకరాల్లో రైతులు ఉద్యాన పంట(పండ్ల తోటలు, కూరగాయ)లను సాగుచేస్తున్నారు. అందులో 13 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, 7వేల పైచిలుకు ఎకరాల్లో వివిధరకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. రంజోల్, హుగ్గెల్లి, చిన్నహైదరాబాద్, హోతి(బి), కాశీంపూర్, రాయిపల్లితండా, మొగుడంపల్లి, ధనసిరి, గోపన్‌పల్లి, పర్వతాపూర్, కవేలి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, పిచేర్యాగడి, మనియార్‌పల్లి, ఈదులపల్లి గ్రామాల వ్యవసాయ భూములు ఉద్యాన పంటల సాగుకు యోగ్యమైనవి. గ్రామానికి చెందిన కొందరు రైతులు వివిధ ప్రాంతాలకు వెళ్లి కొత్త రకం వంగడాలను తీసుకొచ్చి అధికారుల, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆయారకాల పంటలను సాగు చేస్తున్నారు.

క్షేత్రస్థాయితోనే మరింత అర్థమవుతున్నది



తాము కళాశాలల్లో నేర్చుకున్న దానికంటే క్షేత్రస్థాయిలో చూసి ఎంతగానో నేర్చుకుంటున్నాం. పంటల సాగు, దిగుబడి, సస్యరక్షణ విధానం, రైతులతో అనుభవాలను పంచుకోవడం తమకు సంతృప్తినిస్తున్నది. స్థానికంగా ఉన్న వ్యవసాయ భూములన్నీ ఉద్యాన పంటలకు అనుకూలమైనవి కావడంతో తమ విద్యాబోధనకు ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సహకారంతో ఉద్యాన పంటలను సాగుచేసే రైతుల వెంట పొలాలకు వెళ్లి కొత్త రకం సాగుతీరును చూస్తున్నాం. ఈ శిక్షణ జీవింతాతం గుర్తుండి పోయేలా ఉన్నది. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వెన్నంటి ఉంటూ తమకు మరింత సహకరిస్తున్నారు.

- సంకీర్తన విద్యార్థిని, కరీంనగర్

రైతులతో కలిసి నేర్చుకోవడం సంతృప్తిగా ఉన్నది



రైతులతో కలిసి వారివెంట పొలాలకు వెళ్లి నేర్చుకోవడం తమకు ఎంతగానో సంతృప్తినిస్తున్నది. ముఖ్యంగా రైతులే నిత్యం కొత్త రకం శాస్త్రవేత్తలని ఆమె అభివర్ణించారు. వారి వద్ద అపారమైన అనుభవాలను తాము ఒంట బట్టించుకుని మరింత నేర్చుకుంటున్నాం. క్షేత్రస్థాయి సందర్శన ఉపయోగకరంగా మారి మంచి సత్ఫలితాలనిస్తున్నది. పండ్ల తోటలకు జహీరాబాద్ నియోజకవర్గం ఎంతగానో ప్రసిద్ధి చెందుతున్నది. ముమ్మందు ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు రెట్టింపు స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నది.

- సుప్రజ, విద్యార్థిని, నిజామాబాద్

విద్యార్థులకు గైడ్‌లా మారి సలహాలిస్తున్నాం



విదార్థులకు గైడ్‌లా మారి తోచినస్థాయిలో సలహాలు, సూచనలు ఇస్తున్నం. ఇలాంటి అవకాశం కొందరికి మాత్రమే వస్తున్నది. విద్యార్థుల ద్వారా కొత్త పద్ధతులను నేర్చుకుంటున్నాం. జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటలను ఎక్కువగా సాగుచేయడం వల్లే విద్యార్థులను క్షేత్రస్థాయి అధ్యయనం నిమిత్తం పంపిస్తున్నారు. కొత్తరకం పంటలను సైతం రైతులు సాగుచేస్తున్న తీరు విద్యార్థులకు ఉపయోగకరంగా మారింది. గతేడాది ఓబ్యాచ్ వచ్చి నేర్చుకుని వెళ్లారు. ఈఏడాది మరోబ్యాచ్ వచ్చింది. వారందరినీ రైతులకు అటాచ్ చేశాం.

- ప్రదీప్, వ్యవసాయ విస్తీర్ణాధికారి, జహీరాబాద్

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

● మారుతున్న డిజైన్లతో పెరుగుతున్న భారం
● జిల్లా కేంద్రంలో వెక్కిరిస్తున్న అసంపూర్తి నిర్మాణాలు



పిల్లర్ల స్థాయిలోనే వదిలేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29: మెదక్ జిల్లా కేంద్రంలో దశాబ్ద కాలం తర్వాత ప్రారంభించిన రాందాస్ చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నిధుల లేమితో పాటు మారుతున్న డిజైన్ల కారణంగా అసంపూర్తిగానే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏప్రిల్‌లో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేతులమీదుగా రెండు పనులకు భూమి పూజ చేశారు. అప్పట్లో కొంత పనులు జరిగినా.. ఆరు నెలల నుంచి ముందుకు సాగడం లేదు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికిగాను రూ.3 కోట్ల అంచనా వేయగా ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన నిధులు వినియోగించుకునేందుకు ప్రణాళికలు చేశారు. అంతేగాకుండా కాంట్రిబ్యూషన్, పట్టణ ప్రగతి నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ పనులు చేపట్టేందుకు పాలకమండలి నిర్ణయించింది. ప్రస్తుతం సెల్లార్ లెవల్ వరకు పనులు చేయగా ఇప్పటివరకు రూ.38 లక్షలను కాంట్రాక్టర్‌కు చెల్లించారు. అంచనాలకు మించి సెల్లార్ తవ్వకం జరగడం, స్థల వినియోగంలో మార్పులు రావడంతో కొత్తగా డిజైన్లు రూపొందించారు. కానీ అనుమతి రాకపోవడంతో ఆ పనులు కాస్తా నిలిచిపోయాయి. ఇదేకాకుండా మరో రూ.30 లక్షలు కాంట్రాక్టర్‌కు రావాలని తెలుపుతుండగా... నిధులు విడుదల చేయడం లేదని తెలిసింది. ఓ వైపు నిధులు, మరోవైపు డిజైన్స్ అనుమతి లభిస్తే కానీ పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. డిజైన్స్ అనుమతి లభిస్తే నిర్మాణ వ్యయభారం మరో రూ.2 కోట్లు పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ది అదే పరిస్థితి

జిల్లా కేంద్రంలో రెండు, మూడు స్థలాల పరిశీలన అనంతరం ఆర్డీవో కార్యాలయం వెనక రూ.6 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. ప్రస్తుతానికి భూ స్థాయిలో బెడ్ వేసి పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు రూ.70 లక్షల పనులకు రికార్డింగ్ పూర్తి అయినా ఇప్పటివరకు నిధులు రాలేదని కాంట్రాక్టర్ తెలిపారు. ఇక్కడా భూ పరిస్థితులను బట్టి డిజైన్స్ మారడంతో నిర్మాణం వ్యయం రూ.8 కోట్లకు పెరిగే అవకాశమున్నదని తెలిసింది. నిధులు విడుదల కానిదే పనులు ఎలా చేస్తామని ప్రశ్నిస్తున్నారు.

అనుమతులు కోసం కృషి చేయాలి

మున్సిపల్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణమైన డివేయేషన్ డిజైన్స్ అనుమతులు తీసుకురావడంలో ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు కృషిచేయాల్సి ఉన్నది. ఆరునెలలుగా పనులు నిలిచిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి అనుమతులతో పాటు కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేసే విషయంలో కృషిచేస్తే అభివృద్ధి పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉన్నది.



రాందాస్ చౌరస్తాలో సెల్లార్ వద్ద నిలిచిపోయిన మున్సిపల్ కాంప్లెక్స్ పనులు

నిధులు విడుదల కావడం లేదు

మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు సంబంధించిన రూ.30 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉన్నది. నిధుల లేమి కారణంగా డబ్బులు చెల్లించలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభమైనా నిధుల కేటాయింపులో అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు ఇంకా స్పష్టతనివ్వలేదు. దీంతో ఈ పనులు కూడా నిలిచిపోయినట్లు వివరించారు. ఈ రెండు నిర్మాణాల్లో మార్పులు ఉన్నందున తిరిగి అనుమతులు పొందాల్సిన అవసరం ఉన్నది.

- మహేష్, డీఈ

నిజాంపేటలో దొంగల హల్‌చల్

● తాళం వేసిన మూడిళ్లలో చోరీ
● రూ.20 వేలు, 27 తులాల వెండి, తులంన్నర బంగారం అపహరణ



చోరీ చేసిన ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

నిజాంపేట, ఫిబ్రవరి 29: నిజాంపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన వప్పుల కిష్టారెడ్డి, కుమ్మరి బాలరాజు ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలు, సూట్‌కేసులను ధ్వంసం చేసి, వస్తువులను చిందరవందరగా పడేశారు. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి ఇంటి యజమానులకు చెప్పారు. వారు వచ్చి చూడగా తాళాలు ధ్వంసమై ఉన్నాయి. అలాగే ఒంటరిగా నివసిస్తున్న బత్తుల శివవ్వ మూడురోజులుగా చిన్న కుమారుడు అర్జున్ ఇంటికి వెళ్తున్నది. బుధవారం రాత్రి 8 గంటలకు తాళం వేసి వెళ్లి.. ఉదయం 5 గంటలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా టిఫిన్ డబ్బాలో దాచిన వెండి ఆభరణాలు, కొంత నగదును దొంగిలించారని తెలిసింది. పై మూడు ఘటనలలో కలిపి రూ.20 వేల నగదు, అర తులం బంగారం, 27 తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



గౌరమ్మ మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 29: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన గజ్జెల గౌరమ్మ(45) కుమారుడితో కలిసి జీవిస్తున్నది. కొద్దిరోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం సైతం మళ్లీ గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన గౌరమ్మ ఇంట్లోంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం తూప్రాన్ పెద్దచెరువులో గౌరమ్మ మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

మాసాయిపేట, ఫిబ్రవరి 29: మద్యానికి బానిసైన యువకుడు గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన ప్రభాకర్ జల్సాలకు అలవాటు పడి నిత్యం మద్యం సేవించేవాడు. కాగా గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కాశీరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరు..



పోచయ్య(ఫైల్)

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 29: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని అజ్జమర్రికి గ్రామానికి చెందిన అతినారం పోచయ్య(42) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతి



నర్సింహులు మృతదేహం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 29: ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దం నర్సింహులు(53) కాలకృత్యాలకు గ్రామ శివారులోని కూడవెల్లి వాగు వద్దకు వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతిచెందాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆస్పత్రికి తరలించారు.

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం

నిజాంపేట, ఫిబ్రవరి 29: కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు చిన్న కూతురు సుమలత(19) రామాయంపేటలోని ఛత్రపతి శివాజీ డిగ్రీ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్టు

● 22న జరిగిన చోరీలో 7.5 తులాల నగలు స్వాధీనం
● తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 29: తూప్రాన్ పట్టణంలో పట్టపగలు బంగారం చోరీకి పాల్పడిన పాత నేరస్థుడిని గురువారం రాత్రి పట్టుకుని, అతడి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ హమీద్ అలియాస్ హైమద్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 84 చోరీలకు పాల్పడ్డాడు. గతంలో చేసిన చోరీల్లో 2022లో హమీద్‌ను అరెస్టు చేయగా, డిసెంబరులో విడుదలయ్యాడు. కొంత కాలం చోరీలకు దూరంగా ఉండి పండ్ల వ్యాపారం, ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు. ఈనెల 22న తూప్రాన్ పట్టణంలోని ప్రైవేటు క్లర్క్ ఉద్యోగం చేస్తున్న ఉమారాణి ఇంట్లో పట్టపగలు ఇంటి తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీ చేశాడు. బంగారం అమ్మకం చేసేందుకు గురువారం నిజామాబాద్ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు చోరీ చేసిన బంగారం నుంచి తులం అమ్మకం చేసి ఖర్చు చేయగా, 7.50 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు హమీద్ 1996 నుంచి వరంగల్‌లో చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇప్పటి వరకు 84 చోరీలు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ రొడ్డ బోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

సాంబారుతో సరి!

● మధ్యాహ్న భోజనంలో విద్యార్థులు పస్తులు



సాంబరుతో అన్నం వడ్డిస్తున్న తోటి విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. అక్షయపాత్ర అంటే రుచికరమైన పౌష్టికాహారం, కూరగాయలు, పండ్లతో వడ్డించారు. కానీ సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో గురువారం విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా కేవలం సాంబారుతో కూడిన అన్నాన్ని పంపిణీ చేశారు. కేవలం సాంబారుతో భోజనం మింగుడుపడని విద్యార్థులు వంటలు బాగాలేవని ఉపాధ్యాయులకు చెప్పలేక చేసేది లేక సగం గడుపుకే తిని పస్తులుంటున్నారు. కనీసం సాంబారుతో పాటు ఒక రకం కూరగాయలతో భోజనం వడ్డిస్తే బాగుంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

తడి, పొడి చెత్తతో ఆదాయం

● సాహస్ స్వచ్ఛంద సంస్థ పనితీరు భేష్
● రూరల్ మండలంలోని గ్రామాలు స్వచ్ఛతకు నిదర్శనం
● జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



పొడి చెత్త కట్టింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 29: సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామాలు స్వచ్ఛతకు ఆదర్శంగా నిలిచాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అభినందించారు. సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంవత్సర కాలంగా తడి, పొడి చెత్త వేరుచేసి ఇచ్చే పద్ధతిపై సంస్థ కల్పించిన అవగాహన విధానం బేష్ అంటూ కితాబిచ్చారు. తడి చెత్త భూమిలో త్వరగా కలిసిపోవడంతో పాటు పంటకు అవసరమైన ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కానీ పొడి చెత్త భూమిలో కరిగిపోకపోవడంతో పాటు దుష్ప్రభావాలను కలిగిస్తున్నదని చెప్పారు. అందుకే సాహస్ స్వచ్ఛంద సంస్థ పొడి చెత్తను వేరు చేసి ఇచ్చే విధానంపై చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సీజీఐ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి శైలేంద్ర మాట్లాడుతూ తడి, పొడి చెత్తవేరు చేసి వినియోగించడంపై, నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం, థర్డ్ జెండర్స్ అభివృద్ధి కోసం, సాగునీటి కాలువల అభివృద్ధి కోసం సీజీఐ పరిశ్రమ పనిచేస్తున్నదన్నారు. సాహస్ స్వచ్ఛంద సంస్థకు నిధులు అందిస్తూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నదని పేర్కొన్నారు. సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇర్కోడ్ గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వడం వల్ల వర్మీ కంపోస్ట్ ఎరువులు ఉత్పత్తి చేయడం, విక్రయించడం వల్ల రైతులకు నాణ్యమైన ఎరువులు అందుతున్నాయని, గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతున్నదని చెప్పారు. భవిష్యత్తులో పొడి చెత్తపై ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఇర్కోడ్ గ్రామంలోని డంపింగ్‌యార్డులో పొడి చెత్తను వేరుచేసి ముక్కలుగా చేసే మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఎంపీటీసీ బాబు, సాహస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ శేఖర్, కోఆర్డినేటర్ ఇటిక్యాల చిన్న, సూపర్‌వైజర్లు, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగంతో ఎంతో ప్రయోజనం

● శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, శైలజ



కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త వరప్రసాద్, తదితరులు

జహీరాబాద్, ఫిబ్రవరి 29: చిరుధాన్యాలను వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, శైలజ పేర్కొన్నారు. అల్గోల్ గ్రామ శివారులోని డీడీఎస్, కేవీకేలో గురువారం పలువురు రైతులకు చిరుధాన్యాల సాగు, వినియోగం, సేంద్రియ ఎరువుల తయారీ, జీవామృతం తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రతియేటా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాల వినియోగం ఎక్కువ మోతాదులో ఉండాలన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా ఉపయోగించడం వల్ల శరీరానికి పోషకాలు అధికంగా లభిస్తాయని చెప్పారు. రైతులు వారి వారి వ్యవసాయ పొలాల్లో చిరుధాన్యాలను ఎక్కువ మొత్తంలో సాగుచేయాలని కోరారు. చిరుధాన్యాలకు మార్కెట్లో మరింత డిమాండ్ ఉన్నదని వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీభగలాముఖి అమ్మవారి వార్షికోత్సవం

● హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు నేతలు



శ్రీభగలాముఖి అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు దంపతులు

శివ్వంపేట, ఫిబ్రవరి 29: మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీభగలాముఖి అమ్మవారి వార్షికోత్సవాలు వైభవంగా సాగాయి. గురువారం శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం సహస్ర పుష్ప, సహిత హరిద్రార్చన మహామంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వరశర్మ, శివకుమార్‌గౌడ్, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, శ్రీనివాస్ గౌడ్, పురుషోత్తంశర్మ, స్వరూపరమేష్‌గుప్తా, సంతోష్‌శర్మ, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్‌యాదవ్, బుచ్చేస‌యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

చేర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 29 : చేర్యాల మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని, పార్టీలకతీతంగా అభివృద్ధి చేయాలని, అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అధ్యక్షతన చేర్యాల పట్టణ మున్సిపాలిటీ 2024-25 ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా పట్టణానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై నిర్వహించిన సమావేశంలో చర్చించారు. కౌన్సిల్ తీర్మానం పొందిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. కొంతమంది పన్నులు చెల్లించినా చెల్లించలేదని నోటీసులు వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఏమి చేయాలో ఆలోచించాలన్నారు. మధ్యలో నిలిచిపోయిన పనులను సవ్యంగా సాగేంచేందుకు సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు ప్రజల మధ్యలో ఉంటూ వార్డులో నెలకొన్న సమస్యల్ని తెలుసుకుని, పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలిచంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేష్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీష్, కో ఆప్షన్ సభ్యులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పచ్చిమడ్ల అంజనీదేవి, జేబా బేగం, యారవ ఆరోగ్యరెడ్డి, కమిషనర్ రమేష్, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సౌలభ్యం కోసమే కొనుగోలు కేంద్రాలు

● సహకార సంఘాల ద్వారా రైతులకు మేలు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 29: రైతుల సౌలభ్యం కోసమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రమైన తొగుట మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో అత్యధిక శాతం రైతులు పొద్దుతిరుగుడు పంటను సాగు చేశారని, వారికి మార్కెట్ అందుబాటులో ఉండటం కోసం తొగుటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. రైతులు పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధిపొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 6,760గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, ఎంపీటీసీ సుతారి లలితారమేశ్, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు కనకయ్య, గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

రాయపోల్, ఫిబ్రవరి 29: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు అందుబాటులో ఉంటూ, ఎన్నో రకాల సేవలు అందిస్తున్నామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో కలిసి దౌల్తాబాద్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందించే విధంగా సహకార సంఘాలను ప్రోత్సహించడం జరిగిందన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి సంధ్య, జడ్పీటీసీ రణం జ్యోతి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు రహీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈవో మల్లేషం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌లు, కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

● హుస్నాబాద్ మత్స్య ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 29 : రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనంతో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని హుస్నాబాద్ మత్స్య ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పొన్నబోయిన శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.20.050కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఈ పథకంపై గ్రామగ్రామాన గ్రామశాఖల అధ్యక్షులు మత్స్యకారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు 18 సంవత్సరాల వయస్సు కలిగి 60 సంవత్సరాలలోపు ఉన్న స్త్రీలు, పురుషులు అర్హులని పేర్కొన్నారు. సభ్యత్వం రూ.2,200 చెల్లించి సభ్యత్వం పొందాలని వివరించారు. ఈ పథకంలో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన మత్స్య ఉత్పత్తిదారులు ఎక్కువ సంఖ్యలో చేరి, కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌరహక్కులకు భంగం కలిగించవద్దు

● గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సైదా

గజ్వేల్, ఫిబ్రవరి 29: రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులకు భంగం కలిగించవద్దని, ఒకరినొకరు గౌరవించుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. గజ్వేల్ మండలం పరిధిలోని కొమటిబండ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌ఐ కృష్ణతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కులం పేరుతో దూషించడం పద్ధతి కాదన్నారు. గ్రామంలో అసమానతలను, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మనుషులు అందరమూ ఒకటేనని భావించాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ ఒక్కరం గౌరవించుకొని సమాజంలో ముందుకు సాగాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి అవగాహన కల్పించారు. కాలనీలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత డిపార్ట్‌మెంట్ వారితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, అన్నిటినీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు.

మూఢనమ్మకాలను నమ్మొద్దు

● అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్

అక్కన్నపేట, ఫిబ్రవరి 29: మూఢనమ్మకాలు, చేతబడి లాంటి మంత్ర తంత్రాలను నమ్మొద్దని అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్ ప్రజలకు సూచించారు. బుధవారం రాత్రి అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో కనువిప్పు కార్యక్రమంలో భాగంగా పోలీసు కళాబృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేతబడి చేస్తున్నారని ప్రజలు నమ్మొద్దని, ఎవరైనా పుకార్లు చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్, ఏటీఎం వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. గ్రామాల్లో యువకులు గంజాయి, మత్తు పదార్థాలు సేవించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చిన్నపిల్లలను ఎత్తుక వెళ్లేందుకు బీహార్, ఇతర రాష్ట్రాల నుంచి గ్యాంగులు వచ్చాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుందని, అసత్య ప్రచారాలను నమ్మొద్దని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు మీ దృష్టికి వస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గద్దల రమేష్, పోలీస్ కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 29 : తెలంగాణ ప్రభుత్వం బుధవారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసిన సందర్భంగా సిద్దిపేట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అజ్మత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 70 రోజుల్లో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు చాలా మోసపోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ధైర్యం వచ్చిందన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ కలిమొద్దీన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ మెరుగు రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాషాద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహాబ్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మద్దూరు, ఫిబ్రవరి 29 : దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా, గురువారం మాఘ బహుళ పంచమిని పురస్కరించుకుని శ్రీభమరాంబ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని వీరశైవ ఆగమం ప్రకారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి గంగా స్నానం చేయించారు. స్వామివారికి తలంబ్రాలు, పుస్తెమెట్టెలను ఆలయ కమిటీ సభ్యులు ఇమ్మడి శోభ పురుషోత్తంరెడ్డి, ఆలయపూజారులు శివప్ప భద్రప్పలు సమర్పించారు. భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించారు. స్వామి వారి కల్యాణంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, నలగొప్పుల రాములు, చింతల రాములు, చొప్పరి లింగయ్య, పాత భాస్కర్, రాజపేట మల్లేశంతో పాటు పలువురు పాల్గొన్నారు.

జోరుగా మొక్కజొన్న సాగు



మండలంలోని గొల్లపల్లిలో మొక్కజొన్న పంట

అక్కన్నపేట, ఫిబ్రవరి 29: ఖరీఫ్‌లో వాణిజ్య పంటలను ఎక్కువ మొత్తంలో సాగు చేసిన రైతులకు కన్నీటిని మిగిల్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో, చీడపీడల బెడద ఎక్కువైన నేపథ్యంలో పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు యాసంగిలో నైనా తమ నష్టాన్ని పూడ్చుకోవాలని ఆశలతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో మంచి ధర రావడం, ప్రభుత్వం మద్దతు ధర చెల్లింస్తుండడంతో రైతును మొక్కజొన్న సాగుపై దృష్టి నిలిపేలా చేశాయి. అక్కన్నపేట మండలంలో 4185, హుస్నాబాద్ మండలంలో 3169 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట పూత, కంకి దశలో ఉంది. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పంట పొలాలకు వెళ్లి రైతులకు పలు సూచనలు, సలహాలను అందిస్తున్నారు.

పక్షులు, వన్యప్రాణులతో బెడద

అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో మొక్కజొన్న పంట కంకి దశలో ఉన్న నేపథ్యంలో పక్షులు, వన్యప్రాణుల బెడద రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది.

మొక్కజొన్నసాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాం



యాసంగిలో రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేశారు. సాగు చేసిన రైతుల దగ్గరికి వెళ్లి మొక్కజొన్న పంటలను పరిశీలించి ఎప్పటికప్పుడు సాగు విధానంపై సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు పంట చాలా బాగుంది. మొక్కజొన్న పంట అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

\- నాగరాజు, మండల వ్యవసాయ అధికారి, అక్కన్నపేట

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

మద్దూరు ఫిబ్రవరి 29 : మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రజిత తెలిపారు. 4, 5వ తేదీల్లో మిగిలిపోయిన పిల్లలకు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు అందిస్తారని తెలిపారు. హైరిస్కు ఏరియాలుగా నారదాసుగుడిసెలు, పిట్టల గూడెం, జెల్లగూడెంలను గుర్తించినట్లు తెలిపారు.

● **గజ్వేల్:** ఐదేళ్లలోపు ప్రతీ చిన్నారికి పోలీయో చుక్కలు వేయాలని శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్‌కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కాంప్లెక్సులో నిర్వహించిన సమావేశంలో ఆయన పల్స్ పోలియోపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన పిల్లవాని నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు.ఆయనవెంట ఈ కార్యక్రమంలో డాక్టర్ సింగ్ కాశీం, సిహెచ్‌ఓ, అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీలత, రూట్ సూపర్వైజర్ డి వాసుదేవ్, నాగరాజు, ఆశావర్కర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్

ప్రమాదకర బీజేపీని ఓడించాలి

● బండి సంజయ్‌కి సంస్కారం లేదు

● సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 29 : కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ, అభివృద్ధిని గాలికి వదిలేసిన బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ.. బండి సంజయ్ సంస్కారహీనుడిగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. తల్లులందరినీ అవమానపరిచేలా మాట్లాడిన సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ, అభివృద్ధిని పక్కనపెట్టి విద్యార్థి, యువజన, మహిళ, రైతు, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని ఆయన అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, శంకర్ బన్సీలాల్, జనార్ధన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద పవన్

నర్సాపూర్ సీఐ బదిలీ

నర్సాపూర్, ఫిబ్రవరి 29: నర్సాపూర్ సీఐగా రంగకృష్ణ నెలరోజుల క్రితమే బదిలీపై రాగా పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ కావాల్సి వచ్చింది. ఆయన స్థానంలో ప్రస్తుతం వెయిటింగులో ఉన్న జాన్‌రెడ్డి నర్సాపూర్ సీఐగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన రంగకృష్ణను మల్టిజోన్-1లో రిపోర్టు చేయాలని ఐజీ ఉత్తర్వులు ఆరీ చేశారు.

శివస్వాముల మహాపడిపూజ

జిన్నారం, ఫిబ్రవరి 29: మండల కేంద్రం జిన్నారంలో శివస్వాముల ఆధ్వర్యంలో మహాపడి పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిర్లింగ శివాలయ సన్నిధానంలో మహాపడిపూజను నిర్వహించారు. శివస్వాములు శంకరయ్య, లక్ష్మణ్, ఫణిభూషణ్, రాజు గౌడ్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహించగా.. జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఖేడ్‌లో టీ-హబ్ ప్రారంభం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 29: ఖేడ్ ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన టీ-హబ్ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవెడ్డి ప్రారంభించనున్నారని వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, ఫిబ్రవరి 29: మండలంలోని రిమ్మనగూడలో సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రిమ్మనగూడ శివార్లల్లో కొంత మంది పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో, దాడులు చేసి రిమ్మనగూడకు చెందిన ఐదుగురిని పట్టుకున్నారు. రూ.14,048 నగదు, అయిదు ద్విచక్రవాహనాలు అయిదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు.

మున్సిపాలిటీకి రూ.36,84,000 ఆదాయం



కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 29: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించిన రైతుబజారు, పశువుల సంత వేలంలో రూ.36లక్షల 84వేలు పలికినట్లు మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం 2024-25 ఆర్థిక సంవత్సారానికి రైతుబజారు, పశువుల సంత వేలం పాటను నిర్వహించారు. రైతుబజారు వేలం పాటలో 20మంది పాల్గొనగా, అత్యధికంగా వేలం పాట పాడిన గంగిశెట్టి రవీందర్‌కు రూ.21లక్షల 54వేలకు రైతుబజారు దక్కింది. అదేవిధంగా పశువుల సంతకు నిర్వహించిన వేలం పాటలో 23మంది పాల్గొనగా, అత్యధికంగా రూ.15లక్షల 30వేలు వేలం పాడిన టి.రాజేశంకు పశువుల సంత దక్కినట్లు మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ నాయకులు



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 29: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సిద్దిపేట లేబర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికవర్గం పక్షాన ప్రధానమంత్రి నిలబడకుండా, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తూ కార్పొరేట్ అధిపతులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భవన నిర్మాణ రంగంలో 60 సంవత్సరాలు పైబడిన నిర్మాణ కార్మికులకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు, ఇతర బెనిఫిట్స్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అందే అశోక్, అధ్యక్షుడు సంపత్, నాయకులు భూమయ్య నరసింహచారి, సురేందర్ ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోనే దుకాణాలను నిర్వహించాలి



దుకాణాలను తీసివేయిస్తున్న మార్కెట్ కార్యదర్శి, పోలీసులు

గజ్వేల్, ఫిబ్రవరి 29: మార్కెట్‌లోనే వ్యాపారాలను కొనసాగించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆయా కూరగాయల, పండ్ల దుకాణాలను గజ్వేల్ ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డితో కలసి తీసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ సమీకృత మార్కెట్‌లోనే క్రయవిక్రయాలను కొనసాగించాలని, రోడ్డుపై క్రయవిక్రయాలు చేపట్టవద్దని హెచ్చరించారు. సమీకృత మార్కెట్‌లో అన్ని రకాల వసతులు ఉన్నాయని, రోడ్డుపై కూరగాయలు, పండ్లను విక్రయించవద్దన్నారు. వారితో మునిసిపల్ సిబ్బంది, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

అందె భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం



మిరుదొడ్డి, ఫిబ్రవరి 29: ఢిల్లీ సంగీత నాటక అకాడమీ నుంచి మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువపురస్కారాన్ని ప్రకటించినట్టు తెలిపారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. డప్పువాయిద్య నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ అవార్డును అందించినట్లు తెలిపారు. డప్పుకు అరుదైన గౌరవం దక్కడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అవార్డును ప్రకటించిన జూరీ సభ్యులకు, కేంద్ర సంగీత నాటక అకాడమీ, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులకు కృతజ్ఞతలను తెలిపారు.

ఆలయ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

● భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 29 : శివరాత్రి సమీపిస్తున్నందున హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయానికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని, భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. పాలకవర్గం లేక దేవస్థానం అభివృద్ధి చెందడంలేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఇప్పటికైనా పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ నియామకం

మద్దూరు, ఫిబ్రవరి 29 : దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకమండలి కమిటీ సభ్యులుగా చొప్పరి మల్లేశం, శోభాపురుషోత్తంరెడ్డి, సిరిరాం, చెన్నోజు బ్రహ్మాచారి, రాజపేట మల్లేశం, స్వర్గం సాంబయ్య నియామకమయ్యారు.

పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం

నారాయణరావుపేట,ఫిబ్రవరి 29: విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని నారాయణరావుపేట మండలం మల్యాల, గోపులపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, నాజీంబాబాలు విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాలల్లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, క్రమ శిక్షణ ఉంటే సాధించలేనిది ఏమీ ఉండదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొగుట, ఫిబ్రవరి 29: మండలంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతిలేదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అధికారులు పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 186 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. అదే విధంగా సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 80 మంది విద్యార్థులకు అందరూ పరీక్షకు హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు వెల్లడించారు.

● **కొండపాక:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 144 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్లో 98 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, ఆరుగురు గైర్హాజరయ్యారు.

● **చేర్యాల:** చేర్యాల మండలం సోషల్ వెల్ఫేర్‌లో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రానికి 202 మందికి గానూ 178 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాత దొమ్మాట గ్రామానికి చెందిన విద్యార్థి అనిల్ పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో సిబ్బంది అనుమతించలేదు.

● **మద్దూరు:** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. 163 మంది విద్యార్థులకు గానూ 163 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరెంటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 160 మంది విద్యార్థులకు గాను, 158 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవి తెలిపారు.



తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థినిలు



గజ్వేల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ

పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఏసీపీ

గజ్వేల్‌టౌన్/గజ్వేల్ ఫిబ్రవరి 29: గజ్వేల్ పట్టణంలోని ఇంటర్‌మీడియేట్ పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ బాలాజీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, ఐదుగురిని గానీ, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు.